# దెయ్యా-మేనా



## గుడిపాటి వెంకటాచలం

ఆ నాటకం, చావని ముసలి పీనిగ మల్లే, యీడ్చుకుని యీడ్చుకుని సమాప్తి చెందేప్పటికి సరిగ్గా నాలుగయింది. మూడణాలు చెల్లించడమువల్ల—ఆ విలవ పూర్తిగా గ్రహించందే బయటికి రా బుద్ధి పుట్టలేదు. "ఇప్పుడేం నిద్ర? పదండి క్రిష్ణ వొడ్డుకి. స్నానం చేసి హోటలికి చేరు కొందాము" అన్నాడు ఒకడు.

రామ మోహన లైబ్రరీ దగ్గిర బ్రిడ్జీ దాటి కాలవకీ నదికీ మధ్య యెత్తుగా ఉన్న గట్టునే నడుస్తున్నాము. ఓ చేతి పక్క అన్ని కష్టాలూ మరిచి నిద్రపోతున్న పట్టణమూ, రెండో చేతి వేపు వెన్నెట్లో నిద్రపోతున్న ఇసికా, దూరంగా శీతా నగరం కొండల పక్కన నిద్రపోతున్న నది పాములాగు అల్లుకుని పడుకుంది. గట్టు కింద వున్న తోటల్లోంచి అవ్యక్తమయిన పరిమళాలు—అప్పుడే వికసించే పువ్వులోంచిగావును వొస్తున్నాయి. అప్పుడప్పుడో కోడి కూత, మా అడుగుల చప్పుళ్లు విన్న కుక్క అరుపు...ఒకడు వెనక్కి తిరిగి "ఆ మంట యేమిటి" అన్నాడు.

"శవం"

"ఒరే దెయ్యాలు – దెయ్యాలు అంటారు: ఒకటీ కనబడవేం?"

"అన్నట్టు నేను దెయ్యం కథ చెపుతాను, వినండి. నేను స్వయంగా ఎరిగిన విషయం."

"వొద్దుగాని—నాకు దెయ్యాలే కనబడితే—కామ దెయ్యాలు ఆడవి కనబడితే బావుండును."

"ఎందుకు?"

"ఆ తమాషా, ఆ అనుభవం ఎట్లా వుంటుందోనని."

"కాని వాస్తవము కాని ఆ మాయ మనుషులతో ఏం సౌఖ్యం?"

రటన

"ఈ మనుషులు మాత్రం నిజమా? వీళ్లూ కల్పనలే నేమో!"

"అయితే లోకమే అబద్ధం."

"ఆ ఆడ దెయ్యాలు మనిషిని రక్త మాంసాలు పీల్చేస్తాయిట."

"ఈ నిజమయిన ఆడవాళ్లు అంతకన్నాను!" అన్నాడు సినిక్.

కొంత సేపటి కిందట మమ్మన్ని కలుసుకొని ఒక పల్లెటూరు కుర్రాడు ఆ దోవనే నడుస్తున్నాడు. అతను "అయ్యా రెండు నెలల కిందట ఒక సంగతి జరిగింది, చెపుతాను, వింటారా? నిజమయిన సంగతి."

"చెప్పు."

"మాది యీ జిల్లా కాదు. ఈ వేపు వాణ్ణి అయితే మీతో యీ కథ చెప్పనే చెప్పను. కారణం చివరికి మీకే తెలుస్తుంది. మా దొక పల్లెటూరు. రెండు మయిళ్ల దూరంలో యింకొక పల్లె ఉంది. దాంట్లోనండీ, ఇంకో వూరు మునసబు ఒక బ్రాహ్మణామెను వుంచాడు. నే నాయన కింద కమతగాణ్ణి. చాలా పలుకుబడి కలవాడు. వోట్లకూ-దానికీ గొప్ప గొప్పవారు వొస్తారు ఆయన యింటికి. ఈ వ్యవహారం పయికి తెలియడం అయనకి యిష్టం లేదు. వారానికి రెండు సార్లు-బాగా చీకటి అయిం తరవాత వొస్తాడు. తెల్లవారక ముందే వెళ్లిపోతాడు. ఆయన వూరినుంచి మా పల్లెకు నేను ఆమె యింటి ముందునించే వెళ్లాలి. మునసబుగారు వొచ్చే రోజున ఆమె స్నానానికి నీళ్లూ, భోజనమూ, గంధమూ, పూలూ, అన్నీ సిద్ధంగా వుంచుతుంది. అందుకని నాచేత ఆమెకు కబురు పంపేవాడు: ఎప్పుడన్నా ఆయనకు రావడానికి వీలులేక పోతే!

ప్రతి రోజూ నేను ఆ దోవనే వెడతాను గనక నాకోసం ఎదురు చూడడం ఆమెకు మామూలయింది.

"మునసబుగారు యీ రోజు రారు" అని నేను చెపితే

"ఇల్లా చూడు-ఇవన్నీ యేం చేసుకోను" అని నన్నడుగుతుంది.

ఆమె నిరాశ చూసినప్పుడు నాకు దిగులు వేసేది.

"ఏం చెయ్యను, యీ భోజనమంతా, నువ్వయినా తిని వెళ్లు," అంటుంది.

ఓ రోజు ఆమె పుట్టిన రోజు పండగ. మునసబుగా రామెకి సేలమంచు పట్టుచీరె పంపారు.

"ఈ సాయింత్రము తప్పకుండా అయ్యగారిని రమ్మను" అంది. నేను సాయింత్రం తిరిగీ వెళ్లి "మంత్రిగారు అవసరంగా కబురు పంపితే పట్నం వెళ్లార"ని చెపితే, ఆమె మొహం చూడవలసిందే, తలంటి పోసుకుని, ఆమె పెద్ద జుట్టు వేళ్లాడేసుకొని దొడ్డి గుమ్మంలో నుంచుంది. దొడ్లో, బీరపువ్వులూ, చంద్రకాంతలూ, విక

